
22-03-2025
శనివారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 182 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి




# పరారీలో సెలబ్రెటీలు



✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 21:

తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలతో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారంలో పోలీసులు దూకుడుగా ముందుకెళ్తున్నారు. బెట్టింగ్ యాప్స్ యజమానులే టార్గెట్‌గా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే బెట్టింగ్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న బాధితుల వివరాలు సేకరించారు. బెట్టింగ్ ఊబిలో చిక్కుకుని ఒక్క ఏడాదిలో 15 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తెలంగాణ వ్యాప్తంగా 15 కేసులు నమోదు చేశారు. ఆయా బెట్టింగ్ యాప్స్ గుర్తించే పనిలో పడ్డారు పోలీసులు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు, ప్రమోటర్లను నిందితులుగా చేర్చనున్నారు.అయితే బెట్టింగ్ యాప్స్ కేసులపై పోలీస్‌శాఖ లీగల్ ఒపీనియన్‌కు వెళ్లబోతుంది.
స్కిల్ బేస్డ్ గేమ్స్‌కి మాత్రమే ప్రకటనలు చేశామంటున్నారు విజయ్, రానా. అయితే సెలబ్రిటీల నుంచి కీలక అంశాలు రాబట్టిన పోలీసులు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులపైన ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకు 108 అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు బ్లాక్ చేశారు. మరో 133 బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు నోటీసులు ఇచ్చారు. బెట్టింగ్ వెబ్‌సైట్లు తెలంగాణలో యాక్సెస్ కాకుండా. జియోఫెన్సింగ్ టెక్నాలజీతో TGCSB చర్యలు తీసుకుంటోంది. బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో ఇప్పటికే విష్ణుప్రియ, రీతూచౌదరి, తేస్టీ తేజ, కిరణ్‌గౌడ్‌లను పోలీసులు విచారించారు. శ్యామల, అజయ్ సన్నీ, సుప్రీత, సన్నీ సుధీర్‌లను విచారణ కోసం సంప్రదించగా వారి ఫోన్లు స్విచాఫ్ వచ్చినట్లు సమాచారం. అలాగే మరికొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా ఇంకా అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. విచారణ భయంతో హర్షసాయి, ఇమ్రాన్, భయ్యా సన్నీయాదవ్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌తో సినీనటులు, ఇన్‌ఫ్లూయెన్సర్లు భారీగా లబ్ధి పొందారని, అసలు వారికి ఏయే మార్గాల్లో డబ్బు వచ్చిందని పోలీసులు ఆరా తీస్తున్నారు.






# బొగ్గు ఉత్పత్తిలో 100 కోట్ల టన్నుల మైలురాయిని దాటిన భారత్

■ ఇది దేశానికి గర్వ కారణం ప్రధాని మోడీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో 100 కోట్ల టన్నుల మైలురాయిని భారత్ దాటింది. ఇది దేశానికి గర్వ కారణమని ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం అభివర్ణించారు. ఇంధన శక్తి భద్రత, స్వావలంబన విషయంలో దేశం నిబద్ధతకు ఇది సూచిక అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తిలోను, పలు పరిశ్రమల్లో ఇంధనంగా ప్రధానంగా ఉపయోగిస్తుండే బొగ్గు ప్రపంచ ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఇంధన వనరుగా ఉంటున్నది. భారత్ 202324 (2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు) 997.83 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 100 కోట్ల టన్నుల మేరకు బొగ్గు ఉత్పత్తి చేయడాన్ని 'భారత్‌కు గర్వకారణం'గా ప్రధాని మోడీ సామాజిక

...మిగతాది 2 లో

# వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం ట్రస్ట్ ఏర్పాటు



- ప్రతి రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం
- అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖ రాస్తాం
- తిరుపతిలో ముంతాజ్, ఎమర్, దేవాలోక్ హోటల్స్‌కు కేటాయించిన 35 ఎకరాలు రద్దు
- 24 క్లేమోర్స్ పేలినా బతికున్నానంటే వేంకటేశ్వరస్వామి భిక్షతోనే
- తిరుమలలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

✍ జయభేరి, తిరుమల, మార్చి 21 :

రాష్ట్రంలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి దేవాలయాలు లేవు. ఆయా గ్రామాల్లో వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం నిధులు సేకరించేందుకు ట్రస్టు ఏర్పాటు చేస్తాం. నాడు ఎన్టీఆర్ అన్నదానం, నేను ప్రాణదానం కార్యక్రమాలు ప్రవేశపెట్టాం. మూడవ కార్యక్రమంగా ఆలయాల నిర్మాణాలను తలపెడుతున్నాం. మాధవ సేవ కోసమే ఆలయాల నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం.

...మిగతాది 2 లో

# హాట్ సమ్మర్ లో.. అందాలపోటీలు




✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 21:

మిస్ వరల్డ్ 2025 పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది తెలంగాణ ప్రభుత్వం. దీనికి సంబంధించి తెర వెనుక ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి.మే 7 నుంచి 31 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. 'తెలంగాణకు తప్పక రండి' అనే నినాదంతో రెడీ అవుతోంది.ఈ పోటీల్లో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల నుంచి అందగత్తెలు భాగ్యనగరానికి తరలి రానున్నారు. మే 10న గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభోత్సవం జరగనుంది. అదే నెల 31న ముగింపు వేడుకలు హైటెక్స్‌లో జరగనున్నాయి. మధ్యలో తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేసే విధంగా వివిధ ప్రాంతాల్లో రకరకాల ఈవెంట్లు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని

...మిగతాది 2 లో



# యాంటీ ఇండియా టెర్రరిస్టుల గుండెల్లో టెర్రర్

2 లో



# కేటీఆర్ పాదయాత్రకు అంతా సిద్ధం

✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 21:

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్త టూర్ ప్రారంభమైంది. తెలంగాణ జిల్లాల్లోని పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశమవుతున్నారు. సూర్యపేట జిల్లా

...మిగతాది 2 లో

# ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించదు

■ కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా



✍ జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 5 :

ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని విధానాన్ని అనుసరిస్తోందని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం రాజ్యసభలో ఉద్ఘాటించారు. దేశంలో నక్సలిజాన్ని 2026 మార్చి నాటికి నిర్మూలించనున్నట్లు కూడా మంత్రి స్పష్టం చేశారు. హోమ్

...మిగతాది 2 లో

# రోజుకు రూ.1700 కోట్లకు పైగా అప్పు చేస్తోంది కాంగ్రెస్ సర్కార్

బిజెపి పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



✍ జయభేరి, హైదరాబాద్ మార్చి 21:

రోజుకు రూ.1700 కోట్లకు పైగా కాంగ్రెస్ సర్కార్ అప్పు చేస్తోందని బిజెపి పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అప్పు రూ. 8.6 లక్షల కోట్లు ఉందన్నారు. బడ్జెట్ పై శాసన సభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమిషానికి రూ. కోటికి పైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోందని చెప్పారు.

...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## బొగ్గు ఉత్పత్తిలో 100 కోట్ల టన్నుల మైలురాయిని దాటిన భారత్

మాధ్యమం 'ఎక్స్' పోస్ట్‌లో అభినందించారు. '100 కోట్ల టన్నుల మైలురాయిని దాటడం గణనీయమైన విజయం. ఇంధన శక్తి భద్రత, ఆర్థిక వృద్ధి, స్వావలంబన పట్ల మన నిబద్ధతకు ఇది ప్రతీక' అని ఆయన పేర్కొన్నారు. ఈ రంగంతో సంబంధం ఉన్న వారందరి అంకితభావాన్ని, గట్టి కృషిని ఇది ప్రతిబింబిస్తోందని మోదీ తెలిపారు. ఈ విజయం గురించి ప్రకటనతో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి సామాజిక మాధ్యమంలో చేసిన పోస్ట్‌పై ప్రధాని మోదీ ఆ వ్యాఖ్య చేశారు.అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థ విధానాలతో భారత్ ఉత్పత్తిని పెంచుకోవడమే కాకుండా సుస్థిర, బాధ్యతాయుత గనుల తవ్వకం జరిగేలా చూసిందని మంత్రి తెలిపారు. 'ఈ విజయం పెరుగుతున్న మన విద్యుత్ డిమాండ్లను తీరుస్తుంది, ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుంది, ప్రతి భారతీయునికి సుసంపన్న భవిష్యత్తును సాధ్యం చేస్తుంది' అని కిషన్ రెడ్డి సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో భారత్ ప్రపంచ ఇంధన శక్తిలో అగ్రగామి దిశగా పయనిస్తోందని ఆయన అన్నారు. ఈ మైలురాయి సాధనలో బొగ్గు రంగంలో శ్రామిక శక్తి కృషిని కూడా కిషన్ రెడ్డి శ్లాఘించారు. 202425 ఆర్థిక సంవత్సరానికి బొగ్గు మంత్రిత్వశాఖ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 108 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం అని అన్నారు.

## వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం ట్రస్ట్ ఏర్పాటు

ట్రస్ట్‌కు వచ్చే నిధులు పకడ్బందీగా ఖర్చు చేస్తాం. వేంకటేశ్వరస్వామి ఆస్తులు ఎవరు కబ్జా చేసినా వాటిని తిరిగి దేవుడికే చెందేలా చేస్తాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తన మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం వేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు వెంగమాంబ అన్నవితరణ కేంద్రంలో అన్నప్రసాదం స్వయంగా వడ్డించారు. అనంతరం మీడియాతో సీఎం మాట్లాడారు.

**వేంకటేశ్వరుడి ప్రాణభిక్షతోనే బతికున్నా**

దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నాం. ప్రతి పుట్టిన రోజు నాడు తిరుమలలో అన్నదానం చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నాం. తిరుమలలో అన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రారంభించారు. ఇప్పటికి విరాళాల ద్వారా రూ.2,200 కార్పస్ ఫండ్ ఏర్పాటైంది. అన్నదానం ఒక మహత్తర కార్యక్రమం. ఇది శాశ్వతంగా జరుగుతుంది. నేను ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించా. మానవ సేవ మాధవ సేవ రెండూ ఉంటాయని ప్రాణదానం తీసుకొచ్చాం. ఏడు కొండలు వేంకటేశ్వరస్వామి సొంతం. ఇక్కడ అపవిత్రం చేయడం, వ్యాపారాలు జరగకూడదు. గతంలో అసెంబ్లీలో ఏడుకొండలు కాదు 5 కొండలు అని వ్యాఖ్యానించినప్పుడు పోరాడాం. ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించి కిందకు వస్తున్న సమయంలో నాపై 24 క్లెమోర్‌మైన్స్ పేల్చారు. అన్ని క్లెమోర్స్ పేల్చినప్పుడు నేను ప్రాణాలతో బతికేవాడిని కాదు..సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి ప్రాణభిక్ష పెట్టారు. ఇందులో వేంకటేశ్వరస్వామి మహిమ ఏంటో ఆలోచించుకోవాలి. 24 క్లెమోర్ పేలితే ప్రాణాలతో తప్పించుకోలేరు. వేంకటేశ్వరస్వామి మహిమ వల్లే బతికాను.

**3 హోటళ్లకు కేటాయించిన భూమి రద్దు చేస్తున్నాం**

గత ఐదేళ్లలో తిరుమల పవిత్రత కోసం చాలా పోరాటాలు చేశాం. అందుకే అధికారంలోకి వచ్చాక వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచే ప్రక్షాళన చేపడతామని చెప్పి చేశాం. కొండకు ఆనుకుని ఉన్న ముంతాజ్, ఎమర్, దేవాలోక్ హోటల్‌స్‌కు అనుమతులు ఇచ్చి 35.32 ఎకరాలు కేటాయించారు. ఈ కేటాయింపులను రద్దు చేస్తున్నాం. ఏడు కొండనలు ఆనుకుని ఎవరూ వ్యాపారం చేయడం, అపవిత్రం చేయడానికి వీల్లేదు. టీటీడీలో పని చేసే ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం...వేంకటేశ్వరస్వామి పవిత్రను కాపాడటానికి ఒకడుగు ముందుకేయాలిగానీ వ్యక్తిగత ప్రయుజనాల కోసం వ్యవహరించ వద్దు. దేశం, ప్రపంచలో వేంకటేశ్వరస్వామి ఆస్తులను కాపాడటానికి కంకణం కట్టుకున్నాం. టీటీడీలో పని చేసేవారు హిందువులై ఉండాలి...ఇతర మతస్తులను గౌరవ ప్రదంగా మరోచోట అవకాశం కల్పిస్తాం. క్రిస్టియన్, ముస్లిం ఆలయాల్లో కూడా ఇతర మతస్తుల ఉండరు. ఏ మతానికి సంబంధించిన ఆలయాల్లో ఆ మతం వారే ఉంటారు. దేశంలోని అన్ని రాజధానుల్లో వేంకటేశ్వరస్వామిని దేవాలయం నిర్మించాలని సంకల్పించాం. దీనికోసం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాస్తాం. ప్రపంచ దేశాల్లో హిందువుల ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వేంకటేశ్వరస్వామి దేవాలయాలు నిర్మిస్తాం.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

## హాట్ సమ్మర్ లో.. అందాలపోటీలు

టూరిజం ప్లాజాలో 72వ ఎడిషన్ మిస్ వరల్డ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే తెలంగాణ పర్యాటక శాఖ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. గతేడాది మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా ఈ కార్యక్రమానికి పోచంపల్లి చీర కట్టుతో దర్శనమిచ్చింది. మిస్ వరల్డ్ పోటీల నిర్వాహకులురాష్ట్ర పర్యాటకసాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనే వివిధ దేశాల యువతులు మే 6 నుంచి 7 వరకు హైదరాబాద్‌కు చేరుకుంటారు. 12న నాగార్జున సాగర్‌లోని బుద్ధవనం, 13న హైదరాబాద్ చార్మినార్, లాడ్‌బజార్‌లకు, 14న వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రానికి, రామప్ప ఆలయానికి, 15న యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లికి అందగత్తెలను నిర్వాహకులు తీసుకెళ్తారు. మే 16 నుంచి 26 వరకు హైదరాబాద్‌లో పలు కార్యక్రమాలు జరగనున్నాయి.మిస్ వరల్డ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. మిస్‌వరల్డ్ పోటీలను అట్టహాసంగా నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక, పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఇదొక మంచి అవకాశం వర్ణించారు. ఇది రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఈ పోటీలను హైదరాబాద్‌లో జరిగేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు.హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌తోపాటు రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన ఉద్దేశమని చెప్పుకొచ్చారు. ఈవెంట్‌కు అయ్యే ఖర్చును నిర్వాహకులుఆతిథ్య రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా చేస్తున్నారు. మొత్తం రూ. 54 కోట్లు కాగా, అందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.27 కోట్లు భరించాల్సి ఉంది. పర్యాటక శాఖ రూ.5 కోట్లు ఇవ్వనుంది. మిగతా రూ.22 కోట్లను టూరిజం కార్పొరేషన్ స్పాన్సర్ల ద్వారా సేకరిస్తుందని తెలియజేశారు.

**ప్రపంచ సుందరి క్రిస్టినా మాటలు**

భారతదేశానికి రాగానే తనకు చాలా గొప్పగా స్వాగతం పలికారని చెప్పారు ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా. నమస్తే ఇండియా అంటూ ఈ అందగత్తె తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తన ప్రయాణానికి ఇండియానే వేదికని గుర్తు చేశారు. గతేడాది ముంబైలో జరిగిన 71వ మిస్ వరల్డ్ పోటీల్లో విజేతగా నిలిచానని తెలిపింది.ఈ దేశ సంస్కృతి, కళలు ఎంతో గొప్పగా ఉన్నాయని మనసులోని మాట బయటపెట్టింది. తెలంగాణకు వచ్చాక యాదగిరిగుట్టకు వెళ్లానని, అక్కడ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించడం మంచి అనుభూతిని ఇచ్చిందని తెలిపింది. ఈ జర్నీ తనకు ఎప్పటికీ గుర్తు ఉండిపోతుందన్నది క్రిస్టినా మాట

## రోజుకు రూ.1700 కోట్లకు పైగా అప్పు చేస్తోంది కాంగ్రెస్ సర్కార్

కులగణన సర్వేలో రాష్ట్ర జనాభా 3.54 కోట్లు తేలిందని, రాష్ట్రంలో ఒక్కో వ్యక్తిపై రుణభారం రూ.2.27 లక్షలుగా ఉందని తెలియజేశారు. పెద్ద ఎత్తున రుణాలుంటే తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పాలని ప్రశ్నించారు.యూపిఎ కంటే ఎన్డియే హయాంలో ఆర్థిక సంఘం నిధులు పెరిగాయన్నారు. యూపిఎ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో 32 శాతం వాటా ఉండేదని, యూపిఎ హయాంలో కేంద్ర పన్నుల్లో వాటా 23 శాతం కూడా పెంచలేదని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం వచ్చాక కేంద్ర పన్నుల్లో 10 శాతం పెంచి 42 శాతం చేశారని పేర్కొన్నారు. పన్నుల్లో వాటా పెంచాక కూడా కేంద్రాన్ని విమర్శించడం సరికాదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# యాంటీ ఇండియా టెర్రరిస్టుల గుండెల్లో టెర్రర్

ఎప్పుడు ఎవడొస్తాడో తెలియదు! ఎలా వేసేస్తాడో అర్థం కాదు! వారి చావు ఎంత ఘోరంగా ఉంటుందో.. అస్సలు ఊహించలేరు. వారి నేల మీదే.. క్షణాల్లో ఖతమైపోతున్నారు. టెర్రర్ ఎటాక్స్‌ని ప్లాన్ చేస్తున్న టెర్రరిస్టులందరి గుండెల్లో ఇప్పుడు టెర్రర్ మొదలైంది.



పాకిస్థాన్ ఉగ్రవాదులకైతే.. కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఎక్కడున్నా.. ఎంత రహస్య ప్రదేశంలో దాక్కున్నా.. వారి చావు వారిని వెతుక్కుంటూ వచ్చేస్తోంది. ఒక్కొక్కరి ప్రాణాలు తీసేస్తోంది. గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో వరుసగా హతమవుతున్నారు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు. మొన్నటికి మొన్న కుల్‌భూషణ్ జాదవ్ కిడ్నాప్ వెనకున్న మతపెద్ద హతమయ్యాడు. ఇప్పుడు.. 26/11 ముంబై దాడుల ప్రధాన సూత్రధారి అయిన హఫీజ్ సయీద్ మేనల్లుడు..అబూ కతల్ పాకిస్థాన్‌లోనే ఖతమయ్యాడు.కొన్నాళ్లుగా గుర్తు తెలియని వ్యక్తులు అనేకమంది భారత వ్యతిరేక శక్తులను ఖతం చేస్తున్నారు. లేటెస్ట్‌గా.. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా వ్యవస్థాపకుడైన హఫీజ్ సయీద్ మేనల్లుడు.. అబూ కతల్ హతమయ్యాడు. తన అనుచరులతో కాన్వాయ్‌లో వెళ్తుండగా.. ఒక్కసారిగా గుర్తు తెలియని వ్యక్తులు బుల్లెట్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో అబూ కతల్‌తో పాటు అతని బాడీగార్డ్స్ కూడా చనిపోయారు. నిత్యం పాకిస్థాన్ ఐఎస్ఐ నీడలో సంచరించే అబు కతల్‌ని.. ఇలా లేపేయడం హాట్ టాపిక్‌గా మారింది. హఫీజ్ సయీద్, అబూ కతల్ హిట్ లిస్టులో ఉన్నారని ఐఎస్ఐకి తెలుసు. వాళ్లను.. పదేళ్లుగా జాగ్రత్తగా కాపాడుతూ వస్తుందనే సమాచారం ఉంది. అబూ కతల్‌కి ఐదు మారుపేర్లు ఉన్నాయి. హఫీజ్ సయీద్.. లష్కరే తోయిబాకి చీఫ్ అయినా.. తన మేనల్లుడైన అబూ కతల్‌ని చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా నియమించాడు. ప్లాన్ హఫీజ్ వేస్తే.. దానిని అమలు చేసేది అబు కతల్.లష్కరే తోయిబా ఉగ్రవాది అబూ కతల్.. ఇండియాలో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ఉన్నాడు. 2023లో రాజోరి జిల్లాలో జరిగిన ఉగ్ర దాడి, 2024 రియాసి జిల్లాలో జరిగిన బస్సు దాడిలో పాల్గొన్నాడు అబూ కతల్. ఇవి మాత్రమే కాదు జమ్మూకశ్మీర్‌లో అనేక దాడులకు ఇతనే బాధ్యుడు. అందువల్ల.. ఎన్ఐఏతో పాటు ఇండియన్ ఆర్మీ, ఇతర భద్రతా సంస్థల హిట్ లిస్టులో ఉన్నాడు. 2024 జూన్ 9న రియాసి జిల్లాలో.. శివకోరి గుహలో ఉన్న శివాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్న హిందూ యాత్రికుల బస్సుపై దాడి చేశారు.అబూ కతల్ నాయకత్వంలో జరిగిన ఈ దారుణమైన దాడిలో.. 9 మంది పౌరులు మరణించారు. 40 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఉగ్రదాడి తర్వాత రియాసి జిల్లాలో కొత్త భయాందోళన మొదలైంది. 2023 జనవరిలో రాజోరి జిల్లాలోని దంగ్రీ గ్రామంలో నలుగురు ఉగ్రవాదులు ప్రవేశించి.. పౌరులని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారు. ఈ ఉగ్రదాడిలోనూ అబూ కతల్ పాత్ర ఉంది. ఈ దాడిలో ఇద్దరు పిల్లలు సహా ఏడుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు.జమ్మూకశ్మీర్ సరిహద్దు గ్రామాల్లోని యువకులకు డబ్బు ఆశ చూపి.. లష్కరే తోయిబాలోకి రిక్రూట్ చేస్తున్నాడు అబు కతల్. అదొక్కటే కాదు.. మైనారిటీ సమాజానికి చెందిన పౌరులని, భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని ఎటాక్స్ చేయడంలో అబూ కతల్ పాత్ర ఉంటుంది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడం, బోర్డర్ దాటి చొరబడటం, పౌరులని లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం, అశాంతి సృష్టించేందుకు ప్రయత్నించడం లాంటివన్నీ.. అబూ కతల్ కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. వీటన్నింటిపై లోతైన దర్యాప్తు తర్వాత ఐదుగురు నిందితులపై ఎన్ఐఏ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. వీరిలో ముగ్గురు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా కమాండర్లు ఉన్నారు. అందులో.. అబూ కతల్, సైఫుల్లా అలియాస్ సాజిద్ జట్, మహమ్మద్ ఖాసిం ఉన్నారు.జమ్మూకశ్మీర్‌ని అస్థిరపరిచేందుకు దాడులు ప్లాన్ చేయడం, పాకిస్థాన్ నుంచి వచ్చే సూచనల్ని అమలు చేయడం లాంటివి చేయడంలో ఇతనిదే కీలకపాత్ర. అలాంటి.. అబూ కతల్ ఇప్పుడు గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమవడంతో.. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదంపై పోరాటంలో.. ఓ ముఖ్యమైన పరిణామానికి నాంది పలుకుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయ్. పాకిస్థాన్ టెర్రరిస్టులకు, ఖలిస్థాన్ వేర్పాటువాదులందరికీ.. ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల భయం పట్టుకుంది. ఇదంతా.. కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. కొన్ని నెలలుగా నడుస్తున్న వ్యవహారమే. ఇప్పటికే.. ఈ తరహాలో చాలా మంది హతమయ్యారు. ఇక ముందు కూడా ఇది కొనసాగుతుందనే సంకేతాలిస్తున్నారు.ఊరు లేదు.. పేరు లేదు.. స్ట్రాంగ్ ఎవిడెన్స్ లేదు. ఉగ్రవాదులను ఏరిపారేస్తున్న గుర్తు తెలియని వ్యక్తుల జాడ కూడా తెలియట్లేదు. ఎవరు చంపేస్తున్నారో అస్సలు అర్థం కావట్లేదు. ఇదంతా.. మూడు నాలుగేళ్లుగా జరుగుతున్న వ్యవహారమే. ఇప్పటికే.. ఇలాంటి హత్యలు చాలానే జరిగాయ్. సిరీస్ ఆఫ్ ఈవెంట్స్‌ని చూశాక.. ఇప్పుడిప్పుడే అందరిలోనూ అనుమానం కలుగుతోంది. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులందరినీ.. ఒకరి తర్వాత ఒకరిని హతమారుస్తున్నారు గుర్తు తెలియని వ్యక్తులు.ముఖ్యంగా.. భారత్‌కు శత్రువులుగా ఉన్న వాళ్లు, ఇండియా హిట్ లిస్టులో ఉన్న వాళ్లంతా.. విదేశాల్లో హతమైపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇలా..గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేస్తుండటంతో.. చాలా మంది ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోని రహస్య ప్రదేశాల్లో దాక్కుంటున్నారు.. లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు, జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు అత్యంత సన్నిహితులైన వాళ్లు కూడా.. గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యారు. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న ఎందరో తీవ్రవాదులు, ఖలిస్థానీ ఉగ్రవాదులంతా ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్నారు. లష్కరే తోయిబాకు చెందిన అబ్దుల్ సలామ్ భుట్టావి, జియార్ రెహమాన్, అబూ ఖాసిం, ముఫ్తీ ఖైజర్ ఫరూక్, సర్దార్ హుస్సేన్ లాంటివాళ్లంతా.. పాకిస్థాన్ గడ్డ మీదే హత్యకు గురయ్యారు. ఇక.. జైషే మహ్మద్‌కు చెందిన ఉగ్రవాదులు దావూద్ మాలిక్, షాహిద్ లతీఫ్, అతని సోదరుడు హారిస్ హాషిమ్, జహూర్ మిస్త్రీ కూడా పాక్ నేల మీదే ప్రాణాలు కోల్పోయారు.నిషేధిత ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్దీప్ సింగ్ నిజ్జర్ కెనడాలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యాడు. అతనే కాదు.. ఖలిస్థాన్ ఉగ్రవాదులుగా పేరున్న సుఖ్దూల్ సింగ్, రిపూదామన్ సింగ్ కూడా కెనడాలోనే హత్యకు గురయ్యారు. అవతార్ సింగ్.. లండన్‌లో మర్డర్ అయ్యాడు. పరంజిత్ సింగ్, హర్వీందర్ సింగ్ సందూ.. లాహోర్‌లో గుర్తుతెలియని వారి చేతిలో చనిపోయారు. ఇక.. భారత్‌లో ఉగ్రదాడులకు పాల్పడిన బషీర్ అహ్మద్ పీర్, సయ్యద్ ఖలీద్ రజా, ఎజాజ్ అహ్మద్.. లాంటోళ్లంతా చనిపోయారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం IC814 హైజాకర్లలో ఒకరైన మిస్త్రీ జహూర్ ఇబ్రహీంని కూడా కరాచీలో కాల్చి చంపారు.2022 నుంచి ఇప్పటివరకు ఇదే తరహాలో.. చాలా మంది ఉగ్రవాదులు, భారత వ్యతిరేక శక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఓ వైపు ఈ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్ని కనిపెట్టేందుకు భారత ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. ఇదే సమయంలో ఉగ్రవాదులంతా హత్యకు గురవడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఉన్న అనుమానాలు, ఆరోపణల మేరకు పాకిస్థాన్ సైన్యం ఎంత రక్షణ కల్పించినా.. ఏ ఉగ్రవాది కూడా సేఫ్‌గా లేడనే విషయం అర్థమవుతోంది. ఇందుకు.. వరుసగా జరుగుతున్న ఉగ్రవాదుల ఏరివేత ఎపిసోడ్లే బిగ్ ఎగ్జాంపుల్. ఏదో ఒకరోజు వాళ్లంతా.. గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో బలైపోక తప్పదంటున్నారు. ఎంత సెక్యూరిటీ ఉన్నా.. వాళ్లంతా సురక్షితంగా లేరనే విషయం తెలుస్తోంది. ఎక్కడున్నా.. ఎలాంటి చోట దాక్కున్నా.. ఎంత సేఫ్‌గా ఉన్నామని అనుకున్నా.. ఏదో ఒక రోజు చావు వాళ్ల దాకా వెళ్తుందనే విషయం.. ఇప్పటికే అర్థమై ఉంటుందంటున్నారు.

## కేటీఆర్ పాదయాత్రకు అంతా సిద్ధం

బీఆర్ఎస్ కార్యకర్తలతో కేటీఆర్ భేటీ అయ్యారు. సడెన్‌గా ఇలా కార్యకర్తల వద్దకు వెళ్లాలనే నిర్ణయం వెనుక చాలా పెద్ద కారణమే ఉంది.ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం. 25 సంవత్సరాలు పూర్తి చేసుకోనుంది గులాబీ పార్టీ. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సంబరాలు తెలంగాణ వ్యాప్తంగా జరుపుకోవాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. పార్టీ ప్లీనరీ సభ, ఏప్రిల్ 10 నుంచి 27వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఏప్రిల్ 27వ తేదీన వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై కేటీఆర్ ఈ భేటీల్లో చర్చిస్తారు. దీని కోసం అన్ని జిల్లాల్లో సన్నాహక సభలు నిర్వహించనున్నారు.తెలంగాణ వ్యాప్తపర్యటన ఇప్పుడు పార్టీ వర్గాల్లోను, రాజకీయంగాను చర్చ సాగుతోంది. పార్టీకి కేటీఆర్ అండ్ హరీశ్‌రావు రెండు కళ్లు. 2018 ఎన్నికల తర్వాత కేటీఆర్‌కు వర్కింగ్ ప్రసిడెంట్‌గా కేసీఆర్ ప్రమోషన్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన తర్వాత కేసీఆర్ కేబినెట్‌లో కేటీఆర్‌తోపాటు హరీశ్‌రావుకు చోటు కల్పించలేదు. పార్టీలో కేటీఆర్‌కు ప్రమోషన్ ఇచ్చిన కేసీఆర్ హరీశ్‌కు ఏడాది తర్వాత ఆర్థికమంత్రిగా ఛాన్స్ ఇచ్చారు. గత శాసనసభ ఎన్నికల్లోను కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తే హరీశ్‌రావు మాత్రం మెదక్ జిల్లాకే పరిమితమయ్యారు. హరీశ్‌రావును కూడా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించేలా చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్న వాదన హరీశ్ అభిమానులు, పార్టీ నేతలు ప్రస్తావిస్తుంటారు. గతంలో ఇలా లీడ్ తీసుకొని పార్టీ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్న సందర్భాలు చాలా తక్కువ. ప్రత్యేక కార్యక్రమాలకే వెళ్లారు తప్ప ఇలా ఎప్పుడూ వెళ్లలేదు.

ఇప్పుడు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా టూర్ పెట్టుకున్నారు. ఈ మధ్య కాలంలోనే కేటీఆర్ మనసులో మాట చెప్పారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. అప్పట్లో ఇదో పెద్ద చర్చకు దారి తీసింది. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచనతోనే ఈ ప్రకటన చేశారా లేక కేటీఆర్ తనకు తానుగానే కార్యాచరణ ప్రకటించారా అన్న డిస్కషన్ పార్టీ వర్గాల్లో నడిచింది. ఇప్పుడు పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తోంది. దీన్ని విజయవంతం చేసే బాధ్యతను వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ అప్పగించారు. అందుకే కేటీఆర్ రాష్ట్ర టూర్ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సన్నాహక సభలు నిర్వహించి పార్టీ నేతలతో మాట్లాడతారు. ఇది కేవలం సిల్వర్ జూబ్లీ వేడుకల కోసం చేస్తున్న సన్నాహకం మాత్రమే కాదంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇది ఓ రకంగా పార్టీ అంతా కేటీఆర్ కనుసన్నల్లోకి తీసుకొచ్చే ఎత్తుగడగా చెబుతున్నారు. కేటీఆర్‌కు కీలక బాధ్యతలు అప్పగిస్తారని ఎప్పటి నుంచో చర్చ నడుస్తున్నా అదే టైంలో సీనియర్ అయిన హరీశ్ పరిస్థితి ఏంటీ ఏ బాధ్యతలు అప్పగిస్తారనే మాట కూడా వినిపిస్తోంది. గులాబీ పార్టీలో సీనియర్ లీడర్లలో హరీశ్ రావు ఒకరు. పార్టీ ట్రబుల్ షూటర్‌గా ఆయనకు పేరు ఉంది. కేసీఆర్ పార్టీ పరంగా అప్పగించే ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించడంలో దిట్ట. పార్టీలో ఏ సంక్షోభం వచ్చినా దాన్ని చల్చార్చేది హరీశ్ రావేనని పార్టీ నేతలు చెబుతారు. అటు పార్టీ సీనియర్లను, జూనియర్లను సమన్వయం చేస్తూ పార్టీకి అనుసంధానకర్త పాత్ర పోషిస్తారని టాక్. పార్టీలో కేటీఆర్ కన్నా హరీశ్‌రావే సీనియర్.

అయితే కేటీఆర్‌కు ప్రమోషన్ ఇచ్చిన కేసీఆర్ హరీశ్ రావు పాత్ర మాత్రం తేల్చలేదు. మరి ఇప్పుడు గులాబీ సంబరాల సన్నాహక సభలకు కేవలం కేటీఆర్ ఒక్కరే వెళ్తారా... లేక హరీశ్ రావు కూడా జిల్లాలు పర్యటిస్తారా అన్న స్పష్టత ఇంకా లేదు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సంబరాలు, పార్టీ సభ్యత్వ నమోదు, ఏప్రిల్ 27 నాటి బహిరంగ సభ నిర్వహణకు టైం లేదు. దీంతో జిల్లాల పర్యటన బాధ్యతలు హరీశ్‌రావుకు కూడా అప్పగిస్తారా అప్పగించరా అన్న ఉత్కంఠ నెలకొంది. సాధారణంగా భారీ బహిరంగ సభలను విజయవంతం చేసే బాధ్యతలను హరీశ్ రావుకే ఎక్కువగా కేసీఆర్ అప్పగించిన సందర్భాలు ఉన్నాయి. వాటిని విజయవంతం చేసిన చరిత్ర హరీశ్ రావుకు ఉంది. ఏప్రిల్ 27వ తేదీ భారీ బహిరంగ సభ బాధ్యతలు హరీశ్ రావుకే అప్పగించవచ్చన్న వార్తలు వస్తున్నాయి.పార్టీలో ఉద్యమం నాటి నుంచి తనకుంటూ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఎమ్మెల్సీ కవితకు అప్పగించే బాధ్యతలు ఏంటనే మరో చర్చ నలుగుతోంది. మద్యం కేసులో జైలుకు వెళ్లి వచ్చినప్పటి నుంచి కవిత దూకుడుగా రాజకీయాల్లో పాల్గొంటున్నారు. ఎస్సీ, బీసీ వర్గాల సమస్యలు, డిమాండ్లపై సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీకి కౌంటర్లు ఇస్తూ పార్టీని బలోపేతం చేసే విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమెకు కూడా ఎలాంటి పార్టీ పదవి ఇవ్వలేదు. కేటీఆర్‌కు పార్టీలో లీడింగ్ పోజిషన్ ఇచ్చిన కేసీఆర్, హరీష్ అండ్ కవితకు అప్పగించే బాధ్యతలు ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వీరంతా కేసీఆర్ కుటుంబ సభ్యులే. అయినా ఉద్యమాలు చేశారు. రాజకీయాల్లో కూడా ప్రూవ్ చేసుకున్నారు. పార్టీ క్యాడర్‌పై ఈ ముగ్గురి ప్రభావం చాలా ఉంటుంది. అందుకే హరీశ్రావు, కవితకు భవిష్యత్ ఏంటని పార్టీలో వారి పాత్ర గురించే అందరూ ఎదురు చూస్తున్నారు.

## ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించదు

మంత్రిత్వశాఖ నిర్వహణపై చర్చకు అమిత్ షా సమాధానం ఇస్తూ, ప్రభుత్వం 370 అధికరణం రద్దు ద్వారా రాజ్యాంగ నిర్మాతల కలను సాఫల్యం చేసిందని వెల్లడించారు. '370 అధికరణం కాశ్మీర్‌లో వేర్పాటువాదానికి ప్రాతిపదిక. అయితే, ఆ అధికరణాన్ని తాత్కాలికం చేసినందుకు, దానిని రద్దు చేసే విధాన్ని కూడా అధికరణంలో చేర్చినందుకు రాజ్యాంగ రూపశిల్పులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని చెప్పారు. 'అయితే, వోటు బ్యాంకు రాజకీయాలు, మూర్ఖపు పట్టుదల కారణంగా 370 అధికరణం కొనసాగింది. 2019 ఆగస్టు 5న 370 అధికరణాన్ని రద్దు చేయడమైంది. దేశంలో ఇద్దరు ప్రభుత్వాధినేతలు, రెండు రాజ్యాంగాలు, రెండు పతాకాలు ఉండరాదన్నది మన రాజ్యాంగ రూపశిల్పుల కల' అని ఆయన తెలిపారు. 370 అధికరణం రద్దు అనంతరం జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులతో భారతీయ యువత బంధం దాదాపుగా మాయమైందని హోమ్ శాఖ మంత్రి చెప్పారు. యుపిఎ హయాంలో ఒకప్పుడు పరిపాటిగా ఉన్న ఉగ్రవాదులను ఘనంగా కీర్తించడం ఎన్‌ఎడి పది సంవత్సరాల పాలనలో అంతమైందని తెలిపారు.

'పది సంవత్సరాల క్రితం ఉగ్రవాదుల అంత్యక్రియల ఊరేగింపులు సాధారణంగా ఉండేవి.జనం వారిని కీర్తిస్తుండేవారు. కానీ ఇప్పుడు, ఉగ్రవాదులు హతమైనప్పుడు వారిని వెంటనే ఖననం చేస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ సౌకర్యాలు అనుభవించిన వారి బంధువులను ప్రభుత్వ పదవుల్లో నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించి గట్టి సందేశం పంపింది' అని ఆయన తెలియజేశారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదం, రాష్ట్రాల్లో వామపక్ష తీవ్రవాదం, ఈశాన్య ప్రాంతంలో తిరుగుబాటు సమస్యలు భారత్‌కు అతిపెద్ద సమస్యలు ఉన్నాయని అమిత్ షా చెప్పారు. 'నాలుగు దశాబ్దాల్లో సుమారు 92 వేల మంది పౌరులు హతులయ్యారు. వాటిని అణిచేందుకు సంఘటిత కృషి ఏమీ జరగలేదు. మోడీ ప్రభుత్వం ఆ పని చేసింది' అని ఆయన తెలిపారు.

మోడీ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించడం లేదని హోమ్ శాఖ మంత్రి స్పష్టం చేశారు. ఉగ్ర సంఘటనల్లో పౌరులు, భద్రత సిబ్బంది మరణాల సంఖ్య బాగా తగ్గిపోయిందని, కాశ్మీర్ లోయలో రాళ్లు రువ్వే ఘటనలు ముగిసాయని కూడా ఆయన తెలిపారు. 'మోడీ ప్రభుత్వ హయాంలో జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదం వల్ల మరణాలు 70 శాతం తగ్గాయి. ఉగ్ర ఘటనలు కూడా బాగా పడిపోయాయి' అని ఆయన చెప్పారు. 'పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా జమ్మూ కాశ్మీర్‌లో అట్టడుగు స్థాయి నుంచి ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగిందని కూడా అమిత్ షా తెలియజేశారు. 'జమ్మూ కాశ్మీర్‌లో 201924 కాలంలో సుమారు 40 వేల ప్రభుత్వోద్యోగాల కల్పన జరిగింది. 1.51 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పన జరిగింది. నైపుణ్య క్లబ్‌లు పని చేస్తున్నాయి' అని ఆయన చెప్పారు.పూర్వపు ప్రభుత్వాలు నక్సలిజానికి వ్యతిరేకంగా చర్య తీసుకోలేదని కూడా ఆయన ఆరోపించారు. '2026 మార్చి 21 నాటికి దేశంలో నక్సలిజం అంతం అవుతుంది' అని హోమ్ శాఖ మంత్రి స్పష్టం చేశారు. ఈశాన్య ప్రాంతం గురించి అమిత్ షా ప్రస్తావిస్తూ, ఆ ప్రాంతం మొత్తం మీద ప్రశాంతంగా ఉందని. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నూతన అభివృద్ధి శకం ఆవిర్భవించిందని చెప్పారు. '2019 నుంచి మేము దాదాపు 19 ఒప్పందాలపై సంతకాలు చేశాం. అదే కాలంలో ఈశాన్య ప్రాంతంలో దాదాపు పది వేల మంది తీవ్రవాదులు లొంగిపోయారు' అని అమిత్ షా తెలియజేశారు.

# కేసీఆర్ ను గవర్నర్ బర్తరఫ్ చేయాలి

- కెసిఆర్ అవినీతి, అక్రమాలపై సర్కార్ దర్యాప్తు చేపట్టాలి
- కెసిఆర్ ఫాంహౌజ్ వీడి నిండా ముంచిన నిర్వాసితులను ఆదుకోవాలి
- కాంగ్రెస్ పోరు బాటలో సిద్ధిపేట డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి




**జయభేరి, గజ్వేల్, మర్చి 21 :**

మాజీ సీఎం కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దర్యాప్తు చేపట్టాలని, ప్రజలకు అందుబాటులో ఉండని, అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాని ఆయనను గవర్నర్ వెంటనే బర్తరఫ్ చేయాలని కోరారు. పోరు బాటలో భాగంగా శుక్రవారం సిద్ధిపేట జిల్లా కోడకండ్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్ధిపేట కలెక్టరేట్ నుండి ప్రారంభమైన పోరుబాట ర్యాలీ గవర్నర్ కార్యాలయం వరకు ఉంటుందని, అయితే ప్రజా సమస్యలు పట్టని, మల్లన్న సాగర్ నిర్వాసితులను నిండా ముంచిన కెసిఆర్ కు బుద్ధి చెప్పడమే లక్ష్యంగా భారీ కార్యకర్తల ర్యాలీతో పోరుబాట చేపట్టినట్లు స్పష్టం చేశారు.

మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తకుండా కెసిఆర్ తప్పించుకు తిరుగుతున్నట్లు ఎద్దేవా చేశారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలను ఆదర్శ కాలనీ అన్న కెసిఆర్, హరీష్ రావు అక్రమాల ఫలితంగా జనం చస్తే బొంద పెట్టేందుకు కూడా స్థలం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యలపై మాజీ మంత్రి హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాయగా, మరి వారి సమస్యలు అసెంబ్లీలో ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టుల నిర్మాణం, పరిహారం చెల్లింపు, ప్లాట్ల కేటాయింపు, ఇండ్ల నిర్మాణాల్లో అక్రమాలు బయట పడతాయనే భయంతో ముంపు బాధితుల సమస్యలు లేవనెత్తడంలేదని అన్నారు. గజ్వేల్ లో కమిషన్లు వచ్చే భవన నిర్మాణాలు తప్ప పేదలకు ప్రయోజనం జరిగే పనులేమీ లేవని తెలిపారు.

గజ్వేల్ పరిధిలో రూ కోట్ల అభివృద్ధి జరిగిందని టిఆర్ఎస్ అంటుండగా, రింగ్ రోడ్డు నిర్మాణం ఎందుకు నిలిచిందని విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్రంలో అధికారం కోల్పోయినా కేటీఆర్, హరీష్ రావులకు అహంకారం తగ్గలేదని ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు, స్పీకర్, గవర్నర్లను కూడా వారు అసభ్య పదజాలంతో దూషించడం వదల లేదని ఆరోపించారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా 15 నెలలుగా అందుబాటులో లేని కేసీఆర్ ఇప్పటివరకు రూ 58 లక్షలు జీత బత్యాలు పొందినట్లు చెప్పారు. ఇక్కడి సమస్యలు పరిష్కరించకుండా ఆయన జీతభత్యాలు ఎలా తీసుకుంటారని నిలదీశారు. అభివృద్ధి పేరిట కెసిఆర్ చేసిన అప్పులు, వడ్డీలకే రాష్ట్ర ఆదాయం సరిపోతుండగా, కడుపు చేత పట్టుకొని వచ్చిన నిర్వాసితులను బిఆర్ఎస్ గద్దలు వదలకపోవడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరి రవాణా ఖర్చుల పేరిట రూ 50 వేలు చొప్పున ఎవరికిచ్చారో...? చెప్పాలని, ఈ విషయంలో సుమారు రు 20 కోట్లు దండుకున్నట్లు పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్, అప్పటి కలెక్టర్ వెంకట్రాంరెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావు చేసిన తప్పిదాలను కాంగ్రెస్ పై నెట్టడం సిగ్గుచేటని, నిర్వాసితులను నిండా ముంచిన బిఆర్ఎస్ నేతలకు వారి ఉసురు ముడుతుందని అన్నారు.

రాష్ట్ర అభివృద్ధి పేరిట నాలుగైదు శాతం వడ్డీకి ఎన్నో సంస్థలు అప్పులు ఇస్తుండగా, కెసిఆర్ 11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చి కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు దోచిపెట్టిందని తెలిపారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని పక్కదారి పట్టించిన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పగా, గత బిఆర్ఎస్ ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గానికి కెసిఆర్ రూ 100 కోట్ల రుణమాఫీ చేయగా, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ రు 237 కోట్ల రుణ మాఫీ చేసినట్లు వివరించారు.

ఈ కార్యక్రమాల్లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంక్షారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, ఎలక్షన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొనగారి రాజు, కార్యదర్శి రాములు గౌడ్, నాయకులు అంజి యాదవ్, జంగం రమేష్ గౌడ్, ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి, అస్గర్, అజహర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి సమీర్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు చల్లటి నీటి సదుపాయం ఏర్పాటు

**జయభేరి, పి ఏ పల్లి :**

సిఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణ కోసం నిర్విరామంగా కొనసాగిన ఆల్ ది బెస్ట్ కార్యక్రమం, నేడు పీఏ పల్లి మండల కేంద్రంలోని, ఎగ్జామినేషన్ సెంటర్లలో, విద్యార్థులకు చల్లటి నీటి సదుపాయంతో ముగిసింది. చైర్మన్ గ్రామీణ ప్రాంతాలలోని పేద విద్యార్థుల ఉన్నత విద్య లక్ష్యంగా, విద్యార్థులను ప్రోత్సహిస్తూ, ఉపాధ్యాయులను, గౌరవిస్తూ, విద్యార్థులకు ఉపాధ్యాయులకు, అనుసంధాన కర్తగా ఉంటూ, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేస్తున్నారు. జిల్లాలోని దేవరకొండ నాగార్జునసాగర్ నియోజకవర్గం ల లో దాదాపు పది మండలాలలో, తమ యొక్క సేవలను అందిస్తున్నారు. అట్టడుగు నిరుపేద కుటుంబంలో పుట్టినటువంటి సి ఎస్ ఫౌండేషన్ చైర్మన్, గోలి గిరి తాను జీవితం లో అనుభవించినటువంటి అనుభవాలనే, ఛాలెంజ్గా తీసుకొని, చాలెంజ్ ఫర్ సక్సెస్ అనే నినాదంతో, ఫౌండేషన్ స్థాపించడం జరిగింది. నిరంతరం పేద విద్యార్థుల కోసం తపిస్తూ, సమాజ శ్రేయసే లక్ష్యంగా తన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు లక్ష్యంగా, ముందుకెళ్తున్నారు. నేను వేసే ప్రతి అడుగులో నన్ను వెన్నంటి ఉన్నటువంటి, నా ఆశయ సాధనలో భాగస్వాములు అవుతున్నటువంటి అధికారులకు, ఉపాధ్యాయులకు, ప్రజా ప్రతినిధులకు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, గుడిపల్లి మండలం ఎం ఈ ఓ సముద్రాల శ్రీనివాస్, పి ఏ పల్లి మండల ఎం ఈ ఓ వెంకటయ్య, ఉపాధ్యాయులు, బాష్పాక జైపాల్, శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు, భాష్పాక రవి, అచ్యుత్, ఈశ్వర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణ జాగ్రత్తలపై అవగాహనా కార్యక్రమం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఆర్టీసీ డిపోలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఫైర్ స్టేషన్ అధికారి. జే.శ్రీనివాస్ రెడ్డి తన సిబ్బందితో వచ్చి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో ద్వారా వివరించారు. వేసవి ఎండలు మొదలు కావడంతో అగ్ని ప్రమాదాల పట్ల అక్రమంగా ఉండాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో బస్ స్టేషన్ లలో అగ్ని ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు సిబ్బంది ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేసవి ఎండల కారణంగా ఆర్టీసీ బస్సుల్లో అకస్మాత్తుగా మంటలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, ఆర్టీసీ సిబ్బంది, ఫైర్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా అక్రమ నిర్మాణాలు..!

- ఈ అక్రమ నిర్మాణాల పై నోటీసులు జారీ
- పట్టించుకోకుండా ధిక్కరించి అక్రమ నిర్మాణాలు
- కాప్రా సర్కిల్లో చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు..!?
- చర్యలు తీసుకుంటారా.. లేదా? ప్రశ్నిస్తున్న స్థానిక ప్రజాసంఘాలు





**జయభేరి, కాప్రా, :**

కాప్రా సర్కిల్లో అనుమతులు లేకున్నా.. తమకు నచ్చినట్టుగా యదేచ్చగా అక్రమ నిర్మాణాలు చేసుకుంటున్నరు. ఈ అక్రమ నిర్మాణాల పై నోటీసులు జారీ చేసారు... కానీ అవేవీ పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం..?



ఇక వివరాల్లోకి వెళితే కాప్రా సర్కిల్ పరిధి లో మెయిన్ రోడ్ కు కూతపెట్టు దూరంలో లక్ష్మీపురం కాలనీ, అన్నపూర్ణ కాలనీ, డా. ఏఎస్ రావు నగర్, మౌలాలిలో అక్రమ నిర్మాణం, ఎపి ఎచ్ బి కాలనీ లక్ష్మి నగర్, మౌలాలి అక్రమ నిర్మాణంలో ఎలాంటి అనుమతులు లేవు. ఆయినా సరే అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి. గతంలో కూడా కమర్షియల్ షట్టర్లు నిర్మాణం జరగకూడదని అధికారులు నోటీసులు జారీచేసిన చెంప పెట్టుగా అక్రమ నిర్మాణం కొనసాగుతూనే ఉంది. ఇక ఈ అక్రమ నిర్మాణదారుడికి ఎలాంటి భయం లేకుండా నేను ఇంతే అనే రీతిలో అక్రమ నిర్మాణం కొనసాగిస్తూనే ఉన్నాడు. అంటే అధికారులకు అడిగింది ఇచ్చుకున్న, ఇక నాకేంటి భయం..? యధేచ్చగా అక్రమ నిర్మాణాలు చేసుకోవచ్చు! అనే రీతిలో తన పని తాను చేసుకుంటూ అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నడు.. ఈ అక్రమ నిర్మాణ యజమాని.. దీనిపై ఇప్పటికే నోటీసులు జారీ చేసిన దానికి దిక్కులేదు.. ఇక ఏం నోటీసులు జారీ చేస్తారు అంటూ స్థానికులు జిహెచ్ఎంసి అధికారులపై టౌన్ ప్లానింగ్ అధికారిపై అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోకపోతే పై అధికారులకు తెలియజేయాల్సి ఉంటుందని స్థానికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ వెంటనే పెంచాలి

- 15 నెలలు గడుస్తున్నా కానీ పెన్షన్ పెంపు ఊసే లేదు.
- కాంగ్రెస్ ప్రభుత్వానికి దివ్యాంగులు అంటే చిన్న చూపు
- పెన్షన్ పెంచని యెడల రాష్ట్రంలో ఎక్కడికక్కడ రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహిస్తాం
- టీజీడీజెఎసి గౌరవ అధ్యక్షులు దండు శంకర్, అధ్యక్షుడు చిట్టెల సంపత్



**జయభేరి, గజ్వేల్, మర్చి 21 :**

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు దండు శంకర్, అధ్యక్షుడు చిట్టెల సంపత్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.4016 పెన్షన్ ను రూ. 6016 కు పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి దివ్యాంగులు అంటే ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట నిలబెట్టుకొని దివ్యాంగులకు పెన్షన్ పెంచడం జరిగింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగుల పెన్షన్ ను పెంచకుండా కాలయాపన చేయడం ఎంత వరకు సమంజసం కాదన్నారు. దివ్యాంగులకు పింఛన్ పెంచని యెడల రాష్ట్రంలో ఎక్కడికక్కడ రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిజిడిజెఎసి గౌరవ సలహాదారులు బొంగోని శ్రీశైలం, ఉపాధ్యక్షులు కేమ్మసారం అశోక్, అరికెలా సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గూడూరి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి పిల్లి అంజయ్య, కోశాధికారి గూడూరు బాబు మహిళా విభాగం అధ్యక్షులు లావుడ్య సరిత, ప్రధాన కార్యదర్శి బాలమణి తదితరులు పాల్గొన్నారు.

# కేఎంపీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సహాయం

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పట్టణం ఖిల్లా బజారుకు చెందిన గంజి నరసింహ కాలుకు ఆపరేషన్ అయి గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నరసింహ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని తెలుసుకున్న కే.ఎం.పి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం నరసింహ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కెఎంపి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా నరసింహ కుటుంబ సభ్యులు కే ఎం పి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కొండమల్లేపల్లి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము, కూన భానుచందర్, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి ,ఆడెపు సతీష్(రిపోర్టర్) ,ఎర్ర యాదగిరి (మాజీ మార్కెట్ డైరెక్టర్), శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## వెంటనే చర్యలు తీసుకోవాలి

- క్రికెట్ స్టేడియంలో రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణ ప్రోటోకాల్ గురించి స్పీకర్ కి పిర్యాదు

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ లోని క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రోటోకాల్ విషయం గురించి స్పీకర్ ప్రసాద్ కుమార్ ని కలసి చర్యలు తీసుకోవాలని కోరిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. సానుకూలంగా స్పందించిన స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

**జయభేరి, మార్కుక్, మర్చి 21 :**

వడ్ల బస్తాలు లారీలో లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పడి చనిపోయిన ఘటన వర్గల్ మండలంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్సై కర్ణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సా కు చెందిన బిరా ప్రకాష్ (43) తన భార్య తో కలిసి మేడ్చల్ లోని ఎల్లంపేట గ్రామంలో ఉంటూ మాలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. శుక్రవారం వర్గల్ మండలం శాకారం గ్రామంలోని శుక్రవారం శ్రీ సాయి బిన్ని మాడరన్ రైస్ మిల్ లో పని నిమిత్తం వచ్చాడు. వడ్ల లారీ లోడ్ చేస్తుడగా ప్రమాదవశాత్తు లారీలోని వడ్ల బస్తాల పైన నుంచి జారీ క్రింద పడ్డాడు. వెంటనే దగ్గర్లో ఉండే ఆసుపత్రి కి తరలిస్తుడుగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుడి అన్న బిరా హరీష్(43) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు కేసుగా మరణం కేసు గా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తామన్నారు.

## ప్రజ్ఞాపూర్ లో వాటర్ సమస్య పరిష్కరించాలి

- మున్సిపల్ కమిషనర్ వినతి పత్రం అందజేత



**జయభేరి, గజ్వేల్, మర్చి 21 :**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్ లో baటర్ సమస్య తీవ్రంగా ఉండడం వల్ల బిఆర్ఎస్ నాయకులు అందరూ కలిసి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ కి వాటర్ సమస్యపై వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మర్కంటి కనకయ్య, నాలుగో వార్డ్ అధ్యక్షుడు ఎక్కల దేవి కనకరాజు యాదవ్, 16 వార్డ్ అధ్యక్షులు డాకని బిక్షపతి, నాయకులు మన్నే వెంకటేష్, సాయిబాబా, కుర్రే మహేందర్ రెడ్డి, ఎల్ల శ్రీనివాస్, విట్టల్, కోపరేట్ డైరెక్టర్ మల్లేశం గౌడ్, తుమ్మ శ్రీనివాస్, డాక్టర్ రాజు, క్యాసారం కృష్ణ, ఉపేందర్, ప్రభు, షరీఫ్, యాకూబ్, బాలరాజ్, సురేష్, రామచంద్రం, కిషన్, తదితరులు పాల్గొనడం జరిగింది

## గోటి తలంబ్రాల పంపిణి

- రామకోటి రామరాజు ఆధ్యాత్మిక కృషి అమోఘం
- భద్రాచల తలంబ్రాల్లో పాల్గొనడం సంతోషదాయకం



**జయభేరి, గజ్వేల్, మర్చి 21 :**

శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ నిర్వహిస్తున్నటువంటి భద్రాచల సీతారాముల కల్యాణానికి అందించే గోటి తలంబ్రాలు శుక్రవారం నాడు సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు సిఐ సైదా కి అందజేయగా సిఐ చేతుల మీదుగా పోలీస్ డిపార్ట్మెంట్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామకోటి రామరాజు ఆధ్యాత్మిక కృషి, పట్టుదల అమోఘం అన్నారు. గోటితో వడ్లను వలిచి అందించే అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టి రామభక్తిని చాటుకున్న రామకోటి రామరాజు అభినందనీయం అన్నారు.

## ముదిరాజులను బిసి డి నుంచి బీసీ ఏ లోకి మార్చాలి




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ముదిరాజులను బిసి డి నుంచి బీసీ ఏ లోకి మార్చాలని అసెంబ్లీ ముట్టడి ప్రయత్నంలో భాగంగా ముందస్తు అరెస్టును చేయడం జరిగినది. అరెస్ట్ అయిన వారిలో పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాసమల్ల నాగయ్య, రెడ్డి శంకర్ ప్రధాన కార్యదర్శి, మండల అధ్యక్షులు తూటుపల్లి శ్రీనివాసులు, పుట్టం శ్రీను ఉపాధ్యక్షులు, ఫంగ శ్రీను ఉపాధ్యక్షులు, జింకల మధు సహాయ కార్యదర్శి, కొప్పెర శ్రీను కోశాధికారి తదితరులు ఉన్నారు.




## వైద్య పరీక్షలు పేరుతో కాంట్రాక్ట్ కార్మికులపై వేధింపు చర్యలు ఆపాలి

**జయభేరి, పరవాడ:**

పరవాడ సింహాద్రి ఎన్టీపీసీలో వైద్య పరీక్షలు పేరుతో కాంట్రాక్ట్ కార్మికులను వేధింపులు కి గురి చేసే చర్యలు ఆపాలని సిఐటియు ఎన్టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గని శెట్టి డిమాండ్. పరవాడ.సింహాద్రి ఎన్టీపీసీలో కాంట్రాక్ట్ కార్మికులను వైద్య పరీక్షలు పేరుతో వేధింపులకు గురి చేయడం తగదని సిఐటియు ఎన్టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేస్తూ శుక్రవారం పరిశ్రమ ప్రధాని గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వైద్య పరీక్షలు పేరుతో వేధింపులకు గురి చేయడం షుగర్, బీపీ ఉందని డ్యూటీ కి వెళ్ళడానికి అవకాశం లేదని డ్యూటీ నిలుపుదల చేయడం, అన్ని బాగా ఉన్నా సరే 1500 రూపాయలు సీఎంఓ ఆఫీసులో వసూలు చేయడం ఇవ్వక పోతే బయట డాక్టర్లు నుండి ఫీట్ తెచ్చుకోమని రాసి ఇవ్వడం దీనివల్ల కార్మికులు పని దినాలు కోల్పోవడం ఆర్థిక నష్టం జరుగుతుందని ఈ విధంగా వైద్య పరీక్షల పేరుతో కార్మికులకు వేధింపులకి గురిచేయడం సరైనది కాదని అన్నారు. ఎన్టిపిసి యాజమాన్యం కాంటాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించడం కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం కార్మికులను బానిసలుగా చూడడం అన్యాయం అన్నారు. ఏ ఒక్క కాంట్రాక్ట్ కార్మికులను డ్యూటీ నుండి నిలుపుదల చేయడానికి చర్యలు తీసుకున్న పోరాటం చేస్తామని గని శెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి పి నాయుడు, పి గోవిందరాజు, డి రామారావు, ఎస్ రామారావు, ఎం సత్యనారాయణ, ఆర్ చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.


## భవిత కేంద్రంలో ఘనంగా ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవ వేడుకలు



**జయభేరి, పరవాడ:**

పరవాడ భవిత కేంద్రంలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి వికలాంగుల హక్కుల గురించి అవగాహన కల్పించడానికి మరియు వారిని సమాజంలో సమానంగా చూడాలని ప్రోత్సహించడానికి డౌన్ సిండ్రోమ్ దినోత్సవ రోజు వేదికగా పనిచేస్తుంది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల విద్యాశాఖ అధికారి దివాకర్ రావు గారు మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ గురించి వివరించి అలాగే సమగ్ర శిక్షా ద్వారా అందిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. కోరమండల్ టి యూ స్ ర్ అందించినటువంటి స్మార్ట్ టీవీ ని దివాకర్ రావు చేతుల మీదగా ప్రారంభించడం జరిగింది. కోరమండల్ టి యూ స్ ర్ అందించిన స్కూల్ బ్యాగ్స్ (30) దివ్యాంగ విద్యార్థులకు ఎమ్ఈవో దివాకర్ ఎంపీపీఎస్ స్కూల్ పరవాడ హెచ్ఎం నాగేశ్వరరావు చేతులు మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు, భవిత ఉపాధ్యాయులు టి కుమారి, జి శ్రీనివాస్, ఎంపీపీస్ స్కూల్ హెచ్ఎం నాగేశ్వరరావు గారు, మండల విద్యాశాఖ అధికారి దివాకర్ గారు పాల్గొన్నారు.

## ఈ భోనంగిలో ఆర్ఓ ప్లాంట్ని మరమ్మత్తులు



**జయభేరి, పరవాడ :**

పరవాడ మండలం ఈ బోనంగి పంచాయతీ ఫార్మాసిటీ కాలనీ నందు ఫార్మా జెల్ కంపెనీ గత 9 సంవత్సరములు క్రితం నిర్మించిన ఆర్ఓ ప్లాంట్ ఈ మధ్యకాలంలో మర్మాత్తులు గురికావడంతో ఈ విషయం పంచాయతీ సర్పంచ్ ఫార్మా జెల్ కంపెనీకి తెలియజేయగా సుమారు రెండు లక్షల 50 వేలు ఖర్చు చేసి మరమ్మత్తులు చేసి శుక్రవారం గ్రామపంచాయతీకి తాళాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సూర్యదేవర అప్పారావు, సి ఎస్ ఆర్ ఇన్చార్జి రవి , ఎండిఓ ధర్మారావు ,ఈ బోనంగి సర్పంచ్ బొద్ధపు శ్రీనివాస్ కాసుల,జన సేన పార్టీ జిల్లా కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు, మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు, చందక గోవిందరాజు, చందక కృష్ణ, అట్ట నూకరాజు, పంచాయతీ సెక్రటరీ గారు, గడసాల శ్రీను, గొల్లవిల్లి సతీష్, కోమటి కరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపుల్లో తనిఖీలు

**జయభేరి, ఏలూరు:**

శుక్రవారం నాడు జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ , డ్రగ్స్ అధికారులు మెడికల్ షాపుల్లో సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. మెడికల్ షాపుల్లోని బిల్లులను, అనధికార మందుల విక్రయాలపై వివరాలను ఆరా తీసారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగా మెడికల్ షాపుల్లో దాడులు జరిగాయి. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మకాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఎన్ఆర్ఎక్స్ x డ్రగ్స్ ను డాక్టర్ డిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తు నట్లు, ఆ వివరాలపై ఆరా తీసారు.

# మెగా జాబ్ మేళాకు భారీ స్పందన

**జయభేరి, గజ్వేల్, మార్చి 21 :**




స్థానిక ప్రభుత్వ మహిళ కళాశాల లో మెగా జాబ్ మేళాను కళాశాల ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ జాబ్ మేళా నందు నిరుద్యోగులు, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొనడం జరిగింది. సుమారుగా 11 వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొనడం జరిగింది. టెక్ మహేంద్ర, ముత్తూట్ ఫైనాన్స్, ఎల్ఐసి, శ్రీరామ్ ఫైనాన్స్, అపోలో, జీపీతో, హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, స్వాన్ బిజినెస్ సర్వీసెస్, చెందిన ప్రతినిధులు విద్యార్థులను ఇంటర్వ్యూ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమ ప్రారంభ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం మాట్లాడుతూ కళాశాల నందు నిర్వహిస్తున్న జాబ్ మేళాకు పెద్ద ఎత్తున అభ్యర్థులు హాజరు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇకముందు భవిష్యత్తులో కూడా తరచుగా ప్లేస్మెంట్ డ్రైవ్స్ ను నిర్వహిస్తామని తెలియజేశారు. దానికోసం విద్యార్థులకు కావలసిన నైపుణ్యాలను పెంపొందించేందుకు కళాశాల స్థాయిలో శిక్షణ ఇస్తామని తెలియజేశారు. ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ సిహెచ్ శోభారాణి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని విద్యార్థులు, నిరుద్యోగులు మంచి అవకాశాలను పొందాలని ఆకాంక్షించారు.ఈ సెలక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థులలో సుమారు 70 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపిక కాగా, సుమారు 118 మంది విద్యార్థులు ఇతర ఉద్యోగాలలో షార్ట్ లిస్ట్ అయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ కమల క్రిస్టియాన, శ్రీలత, ఐక్యుఏసి కోఆర్డినేటర్ ఎంఎం లక్ష్మి, ప్లేస్మెంట్ సెల్ కమిటీ సభ్యులు డాక్టర్ ఏ బాల చంద్రం, డాక్టర్ జె ఉమారాణి, డాక్టర్ ఏ వేణు, డాక్టర్ సరోజ, డాక్టర్ బి మురళీధర్, డాక్టర్ జయరాజు డాక్టర్ డి సుజాత, మహమ్మద్ అన్వర్, స్వర్ణ, శ్రీధర్, రమేష్ శృతి, నరేష్ ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

**జయభేరి, హన్మకొండ, మార్చి 21:**




ప్రభుత్వ అనుమతి లేకుండానే ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేటు స్కూల్ పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి. తిరుపతి డిమాండ్ చేశారు.హన్మకొండ రాంనగర్ లో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకముందే, హోర్డింగ్స్, కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తూ ముందస్తు అడ్మిషన్లు తీసుకొంటున్న మెరీడియన్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని, ఆ స్కూల్ విద్యాశాఖ అధికారుల నోటీసులోనే లేదని, కనీసం అనుమతికి దరఖాస్తు కూడా చేసుకోలేదని మండల, జిల్లా విద్యాధికారులకు ప్రజా సంఘాల నాయకులు ఫోన్ చేసినప్పుడు తెలిపారని, అయినప్పటికీ ముందస్తు అడ్మిషన్లు తీసుకోవడం, భవనాన్ని ఏర్పాటు చేసుకొని అందులో కనీసం నిబంధనలు కూడా లేనటువంటి బిల్డింగ్లో స్కూలు బోర్డు పెట్టి ప్రచారం నిర్వహిస్తుంటే విద్యాశాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని, విద్యార్థుల తల్లిదండ్రులకు తప్పుడు మాటలు చెప్పి మోసం చేస్తున్నారని, అక్షరాలు నేర్పేందుకే లక్షల రూపాయల ఫీజు చెప్తున్నారని, అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను అందిస్తామని మోసం చేస్తున్నారని, అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి, లక్షలాది రూపాయల ఫీజులు కట్టి మోసపోవద్దని తల్లిదండ్రులకు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి విజ్ఞప్తి చేశారు. హనుమకొండ నగరంలో, ఆరేపల్లిలో పాఠశాల భవనం నిర్మాణం కాకముందే అనుమతులు ఇచ్చారని, యదేచ్ఛగా అనుమతి లేకుండానే ముందస్తుగా అడ్మిషన్లు నిర్వహిస్తూ, హనుమకొండ రాంనగర్ లో పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేసిన దాన్ని వెంటనే విద్యా శాఖ అధికారులు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

## సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి ఫార్మాజెల్ వితరణ

- ఇన్వెర్టర్, ఎల్ఈడి బల్బులు, సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు

**జయభేరి, పరవాడ:**



మండల కేంద్రం అయ్యిన పరవాడ స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి జవహర్లాల్ నెహ్రూ ఫార్మసిటీ సెజ్ లో ఉన్న ఫార్మా జెల్(ఎక్స్ ఫ్లోరా) ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా ఇంటర్నల్ వైరింగ్ తో పాటు 2కేవియే ఇన్వర్టర్,70 ఎల్ఇడి లాంప్ లు,5 సీలింగ్ ఫ్యాన్లు సమకూర్చారు. వీటిని శుక్రవారం ఫార్మా జెల్ మేనేజింగ్ డైరెక్టర్ అనంత డి. బార్భాధికర్, ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ టి.జే. శ్రీనివాస్, హ్యూమన్ రిసోర్స్ వైస్ ప్రెసిడెంట్ సూర్యదేవర అప్పారావు, వి. అనిల్ కుమార్ జనరల్ మేనేజర్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్మెంట్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వైస్ ప్రెసిడెంట్ అప్పారావు మాట్లాడుతూ వసతి గృహ సంక్షేమ అభివృద్ధికి వార్డెన్ ఏ. సుజాత చేస్తున్న కృషిని అభినందించారు.

ప్రభుత్వం, సామాజిక బాధ్యతలో భాగంగా ఫార్మా కంపెనీలు అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో బాగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.


ఈ సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రవేట్ పాఠశాలలకు దీటుగా వసతి గృహ సంక్షేమ బాలికలు రాణించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల, వసతి గృహాల మౌలిక సదుపాయాల కల్పనకు తాము కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. సామాజిక బాధ్యతలో భాగంగా వసతి గృహానికి అడిగిన వెంటనే ఇన్వర్టర్, ఎల్ఇడి లాంప్ లు, ఫ్యాన్లు మంజూరు చేసిన ఫార్మా జెల్ యాజమాన్యానికి వసతి గృహ సంక్షేమ అధికారిని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమానికి ముందు వసతి గృహానికి వచ్చిన ఫార్మాజల్ ప్రతినిధులకు విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఫార్మాజల్ సిఎస్ఆర్ ప్రతినిధులు, వసతి గృహ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ కళాశాల విజ్ఞాన విహారయాత్ర

**జయభేరి, ములుగు, మార్చి 21 :**




సిద్దిపేట జిల్లా ములుగు మండలం నాగిరెడ్డి పల్లి గ్రామ వ్యవసాయ పంట పొలాలలో శుక్రవారం సిఎంఆర్ ఐటి కళాశాల జేఎన్టీయూ హైదరాబాద్ శాఖ వారి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు విజ్ఞాన విహారయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి గ్రామ వ్యవసాయ దారులతో మమేకమై ఆటపాటలతో సందడి చేశారు, అనంతరం సీఎంఆర్ కళాశాల వారి సౌజన్యంతో వ్యవసాయదారులకు చల్లని మజ్జిగ, పండ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందజేశారు, ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, సీఎంఆర్ ఐటి కళాశాల ఆధ్వర్యంలో చదువుతోపాటు విజ్ఞానం సామాజిక సేవ లక్ష్యంగా విజ్ఞాన విహారయాత్ర నిర్వహిస్తూ, మారుమూల గ్రామాల్లోని రైతులతో, రైతు కూలీలతో ఒక రోజు గడపడం చాలా సంతోషంగా ఉందని ఈ నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు మాపట్ల చూపించిన ప్రేమ అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ఐటి కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ విజయ, విద్యార్థిని విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## 165 లక్షల కోట్లకు చేరుకున్న అప్పులు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 21:**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అప్పులు ఒక ముఖ్యమైన అంశంగా ఉన్నాయి. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌తో కలిపి ఉన్న అప్పుల్లో తెలంగాణ వాటా రూ. 1.52 లక్షల కోట్లుగా నిర్ణయించబడింది. అప్పటి నుంచి వివిధ ప్రభుత్వాలు అభివద్ధి పనులు, సంక్షేమ పథకాల కోసం అప్పులు తీసుకుంటూ వచ్చాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి సుమారు రూ. 15 లక్షల కోట్లుగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే, అప్పుల స్థాయి గురించి ఖచ్చితమైన సమాచారం రాష్ట్ర బడ్జెట్ ప్రకటనలు, కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదికల ద్వారా తెలుస్తుంది. 2025-26 బడ్జెట్‌లో తెలంగాణ మొత్తం వ్యయం రూ. 3,04,965 కోట్లుగా ప్రకటించబడింది. ఇందులో అప్పుల గురించి స్పష్టమైన ప్రకటన చేశారు.2026 మార్చి నాటికి తెలంగాణ అప్పులు రూ.5,04,814 కోట్లకు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత 15 నెలల్లో రూ. 1.52 లక్షల కోట్ల అప్పు చేసింది.తెలంగాణ అప్పుల భారం ఒక వివాదాస్పద అంశంగా ఉంది. 2014లో విభజన సమయంలో రూ.1.52 లక్షల కోట్ల అప్పులతో ప్రారంభమైన రాష్ట్రం, 2025 మార్చి నాటికి రూ.5.04 లక్షల కోట్ల అప్పుల స్థాయికి చేరినట్లు చెబుతున్నారు. ఇందులో గత ప్రభుత్వం హయాంలో కాళేశ్వరం వంటి పెద్ద ప్రాజెక్టుల కోసం తీసుకున్న అప్పులు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత 15 నెలల్లో రూ. 1.52 లక్షల కోట్లు అప్పుగా తీసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. అయితే, ఈ అప్పుల్లో ఎంత భాగం అభివద్ధికి, ఎంత సంక్షేమ పథకాలకు ఉపయోగపడిందనేది స్పష్టమైన లెక్కలు లేకుండా చర్చనీయాంశంగా ఉంది.ప్రతి నెలా రూ. 6,500 కోట్లు అప్పులు, జీతాల కోసం ఖర్చు చేయబడుతుందని, మిగిలిన రూ. 12,000 కోట్లు అభివృద్ధి, ఇతర అవసరాలకు వినియోగించబడుతుందని అంచనా. అప్పులు ఎ ఈకలో 33-35% ఉండవచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు, ఇది ఆర్థిక శాస్త్రపరంగా ఆమోదయోగ్యమైన స్థాయిలో ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో ఆదాయ వనరులు పెంచకపోతే భారంగా మారవచ్చు.2025-26 బడ్జెట్‌లో తెలంగాణ మొత్తం వ్యయం రూ.3,04,965 కోట్లుగా ప్రకటించబడింది. ఇందులో ఆరు గ్యారంటీలు (సంక్షేమ పథకాలు), విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వబడింది. రాష్ట్రం తన ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి రూ. 1 ట్రిలియన్ (సుమారు రూ. 83 లక్షల కోట్లు) స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. దీనికి ఐటీ, పారిశ్రామిక వద్ధి, వ్యవసాయ ఆధునీకరణ కీలకం కానున్నాయి.

**అప్పుల భారం:**

అప్పులు పెరుగుతున్నప్పటికీ, వాటిని సమర్థవంతంగా ఉపయోగించి ఆదాయ వనరులను పెంచడం ఒక సవాలు.

సంక్షేమం VS టఅభివృద్ధి: సంక్షేమ పథకాలకు భారీగా ఖర్చు చేస్తూ, అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడకుండా సమతుల్యం చేయడం అవసరం.

**ప్రాంతీయ అసమానతలు:**

హైదరాబాద్ కేంద్రీకృత ఆర్థిక వృద్ధి ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి మందగించడం ఒక సమస్య.



# చూడ్డానికి బక్కగున్నా..

ఈ హీరోయిన్ తన ఐదేళ్ల వయసులోనే క్లాసికల్ డ్యాన్స్ లో శిక్షణ తీసుకోవడం ప్రారంభించింది. కథాకళి, భరత నాట్యం, మోహినీ అట్టం, కూచిపుడి తదితర శాస్త్రీయ నృత్యాల్లో నైపుణ్యం సంపాదించింది. ఇంతేనా.. మార్షల్ ఆర్ట్స్ లోనూ ప్రావీణ్యం సాధించింది. కరాటేలో బ్లాక్ బెల్ట్ హోల్డర్ అయిన ఆమె కేరళ ఫేమస కలరిపయట్టు లోనూ నైపుణ్యం సాధించింది. అలాగనీ చదువును ఏ మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. గతేడాది ఇంటర్మీడియెట్ ను పూర్తి చేసింది. ప్రస్తుతం ఉన్నత చదువుల కోసం రెడీ అవుతోంది. అదే సమయంలో వరుస సినిమాలతోనూ అలరిస్తోంది. ఇప్పటివరకు తెలుగులో ఈ ముద్దుగుమ్మ నటించింది ఒకే ఒక్క సినిమాలో. అయితేనేం తెలుగు ఆడియెన్స్ కు ఫేవరెట్ గా మారిపోయింది. ఇప్పుడు ఇదే సినిమా సీక్వెల్ తో మరోసారి మన ముందుకు వస్తోంది. చూడ్డానికి చాలా బక్కగా, సన్నగా, నాజుకుగా కనిపించి నా ఎంతో క్యూట్ గా ఉండే ఆ హీరోయిన్ మరెవరో కాదు మ్యాడ్ మూవీ బ్యూటీ అనంతిక సనీల్ కుమార్. త్వరలో నే మ్యాడ్ స్క్వేర్ 2 సినిమా రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో ఈ ముద్దుగుమ్మ గురించి పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇందులో చాలామందికి చాలా విషయాలు తెలియదు. కేరళలోని త్రిస్సూర్ ప్రాంతానికి చెందిన అనంతిక ది మ్యాడ్ మొదటి సినిమా అనుకుంటారు చాలామంది. కానీ అంతకు ముందే ఆమె 2022లో రాజమండ్రి రోజ్ మిల్క్ అనే తెలుగు సినిమాలో నటించింది. ఇందులో కీర్తి అనే కాలేజీ అమ్మాయి పాత్రలో కనిపించింద అనంతిక. ఆ తర్వాత 2023లో మ్యాడ్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలాగే రజనీకాంత్ లాల్ సలాంలోనూ ఓ కీలక పాత్ర పోషించింది. అలాగే రైడ్ అనే తమిళ సినిమాలోనూ తళుక్కుమంది



# నవ్వు చూసి గులాబీ మైమరచిపోతుంది..

కోమలి ప్రసాద్ ఓ చలనచిత్ర నటి, ఆమె ప్రధానంగా తెలుగు చిత్రాలలో పని చేస్తుంది. నెపోలియన్, హిట్ 2 ది సెకండ్ కేస్ వంటి చిత్రాలతో మంచి పేరు తెచ్చుకుంది ఈ వయ్యారి భామ. 24 ఆగస్ట్ 1995న ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జన్మించింది కోమలి ప్రసాద్. కర్ణాటకలోని బళ్లారిలో పెరిగింది. ఆమె అహ్మద్‌నగర్‌లోని ప్రవర ఇన్‌స్టిట్యూడ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో డెంటిస్ట్రీని అభ్యసించింది. దాని తర్వాత ఆమె తెలుగు చిత్ర పరిశ్రమపై తనకు ఆసక్తి పెరిగింది. 2016లో నేను సీతాదేవి అనే తెలుగు సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది. 2022లో యంగ్ హీరో కిరణ్ అబ్బవరంకి జోడిగా సెబాస్టియన్ పి.సి. 524 అనే సినిమాలో నటించింది. ఆమె వెబ్ సిరీస్ లూజర్‌లో, ఫైండింగ్ యువర్ పెంగ్విన్‌లో, మోడరన్ లవ్ హైదరాబాద్ అనే ఆంథాలజీ సిరీస్‌లో కూడా కనిపించింది. తర్వాత అడివి శేష్, మీనాక్షి చౌదరి జంటగా నటించిన హిట్ 2 ది సెకండ్ కేస్ సినిమాలో వర్ష అనే ఓ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించి బ్లాక్ బస్టర్ అందుకుంది. గత ఏడాది శశి వదనే అనే ఓ తెలుగు ప్రేమ కథలో కథానాయకిగా నటించింది. చేసింది తక్కువ సినిమాలైన ఈ ముద్దుగుమ్మకి కుర్రాళ్లలో ఫాలోయింగ్ చాల ఎక్కువగానే ఉంది. తాజాగా సోషల్ మీడియా ఈ బ్యూటీ ఫోటోలు తెగ వైరల్ చేస్తున్నారు కుర్రకారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com